

అందమైన బాల్యాన్ని బడిలోనే గడుపనిద్దాం,
బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం,
భావి భారత పౌరుల్ని కాపాడుకుందాం.


www.samasamajam.in

# సమ సమాజం

తెలుగు దిన పత్రిక

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | బుధ వారం 22 జూన్ 2022 | ఎడిటర్ : గోసుకొండ పృద్విరాజు | సంపుటి - 07, సంచిక-96 | పేజీలు - 4 వెల రూ. 5

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak


# ప్రపంచ వ్యాప్తంగా యోగా డే ఉత్సవాలు



## యోగా భారతీయ సంస్కృతికి ప్రతీక

- పూర్వీకులు మనకు అందించిన గొప్ప వరం యోగా
- నిత్యజీవితంలో యోగా భాగస్వామ్యం కావాలి
- సికింద్రాబాద్ యోగా దినోత్సవంలో పాల్గొన్న వెంకయ్యనాయుడు

**హైదరాబాద్, జూన్ 21 (సమ సమాజం):** యోగా భారతీయ సంస్కృతికి ప్రతీక అని భారత ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. యోగా ప్రాచీనమైనదేగానీ.. ఎప్పటికీ కాలదోషం పట్టనిదని వెంకయ్య నాయుడు అన్నారు. కులమతాలకు అతీతమైన యోగా.. భారతీయ సంస్కృతికి ప్రతీక అని తెలిపారు. రోజులో కొంత సమయమైనా యోగా చేస్తే ఆరోగ్యానికి మంచిదని సూచించారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన యోగా దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. యోగా దినోత్సవం నిర్వహిస్తున్న ఆయుష్, సాంస్కృతిక శాఖలను అభినందించారు. ప్రతి ఒక్కరూ యోగాను తమ దైనందిన జీవితంలో ఒక భాగం చేసుకోవాలని వెంకయ్యనాయుడు కోరారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ లో కేంద్ర పర్యాటకశాఖ మంత్రి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన యోగా డేలో ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు పాల్గొన్నారు. తర్వాత ప్రజలతో కలిసి వెంకయ్య, ఇతర నేతలు ఆసనాలు వేశారు. బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు వివేక్ వెంకటస్వామి, మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, బ్యాట్మింటన్ ప్లేయర్ పీవీసింధు, సినీ హీరో అడవి శేష్ యోగా డేలో పాల్గొన్నారు. కార్యక్రమంలో అతిథులను శాలువా, మెమెంటోతో కిషన్ రెడ్డి సత్కరించారు. ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెంపొదించడానికి యోగా ఉపయోగపడుతోందని ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. దీర్ఘకాలం ఆరోగ్యంగా ఉండాలంటే యోగా చేయాలని సూచించారు. పూర్వీకులు మనకు అందించిన గొప్ప వరం యోగా అని...దీనిని మన జీవితంలో భాగం చేసుకోవాలన్నారు. యోగా విశిష్టితను తెలియజేసేలా వివిధ ఆసనాలు వేశారు. యోగం అంటే సాధన చేయడం. యోగా అంటే ఏకాగ్రతను సాధించడం. యోగా ప్రాచీనమైనదే గానీ.. ఎప్పటికీ కాలదోషం పట్టనిది. యోగా ఆత్మవిశ్వాసం కల్పిస్తుంది. కుల మతాలకు అతీతమైనది.. భారతీయ సంస్కృతికి ప్రతీక.. యోగా. ఇది ప్రపంచ దేశాల్లో శాంతికి దోహదం చేస్తుంది. ఏ స్థాయిలో ఉన్నా యోగా సాధన తప్పనిసరి. కొంత సమయమైనా యోగా చేస్తే ఆరోగ్యానికి మంచిది. పెద్దలు మనకు అందించిన యోగాను జీవితంలో భాగం చేసుకోవాలి. ప్రపంచ శాంతిని కాపాడేందుకు అందరూ ప్రయత్నిం చాలి. యోగాతో ఒత్తిడిని అధిగమించవచ్చని వెంకయ్యనాయుడు అన్నారు. యోగా దినోత్సవంలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని పీవీ సింధు అన్నారు. అప్పుడప్పుడు కాకుండా.. రోజూ సాధన చేస్తూ ఉండాలని చెప్పారు. యోగాతో శారీరకంగానే కాదు మానసికంగానూ దృఢంగా



## దేశవ్యాప్తంగా 75 నగరాల్లో యోగా డే వేడుకలు

- మైసూరు వేడులకలో యోగాసనాలువేసిన ప్రధాని మోడీ
- యోగాతో ప్రపంచాన్ని ఏకం చేయవచ్చన్న మోడీ

**బెంగళూరు, జూన్ 21 (సమ సమాజం):** ప్రపంచ వ్యాప్తంగా యోగా డే ఉత్సవాలు జరిగాయి. దేశవ్యాప్తంగా 75 నగరాల్లో యోగా డే వేడుకలు జరిగాయి. అంతర్జాతీయ యోగా దినోత్సవంసందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మంగళవారం ఉదయం కర్ణాటక రాష్ట్రంలోని మైసూరులో జరిగిన యోగా వేడుకల్లో పాల్గొన్నారు. యోగా మన సమాజానికి శాంతిని కలిగిస్తుంది, ఇది మన ప్రపంచానికి శాంతిని తెస్తుంది, యోగా మన విశ్వానికి శాంతిని తెస్తుందని ప్రధాని మోదీ అన్నారు.మైసూరు ప్యాలెస్ గ్రౌండ్స్‌లో ప్రధాని మోదీతో పాటు 15 వేల మందికి పైగా యోగా అభ్యాసకులు వేడుకల్లో పాల్గొన్నారు. 8వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రపంచ వ్యాప్తంగా యోగా సాధన జరుగుతోందని తెలిపారు. ఈ ఏడాది 'యోగా ఫర్ హ్యుమానిటీ' నినాదంతో యోగా డే ఉత్సవాలు జరిపారు.విశ్వ మానవాళి ఆరోగ్యమే లక్ష్యంగా ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా యోగా చేస్తున్నారని ప్రధాని మోదీ అన్నారు. యోగాతో క్రమశిక్షణ, ఏకాగ్రత లభిస్తాయని ప్రధాని మోదీ వివరించారు. మంచి ఆరోగ్యానికి... యోగా బాటలు వేస్తుందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. యోగాతో శాంతివస్తుందని మహర్షులు, ఆచార్యులు

2



## యోగాను దినచర్యలో భాగం చేసుకోవాలి

- సిద్ధిపేటలో యోగా దినోత్సవంలో హరీష్ రావు

**సిద్ధిపేట, జూన్ 21 (సమ సమాజం):** నిత్య జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు పిలుపునిచ్చారు. ఆరోగ్యానికి, మానిసక ధృఢత్వానికి యోగా ఎంతో మేలు చేస్తుందని అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో సిద్ధిపేట పట్టణం కొండా భూదేవి గార్డెన్‌లో ఏర్పాటు చేసిన యోగా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరికీ ప్రపంచ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. యోగాను దినచర్యలో భాగంగా చేసుకొని దీర్ఘాయుష్షును పొందాలన్నారు. ప్రపంచంలో చాలామందికి ఆహారం అలవాట్లతోనే రోగాలు వస్తాయన్నారు. యోగాతో రోగాల బారిన పడకుండా కాపాడుకోవచ్చన్నారు. పిల్లల నుంచి పెద్దల వరకు యోగా సాధన చేయవచ్చని తెలిపారు. శారీరక, మానసిక సమస్యల నుంచి తమను తాము కాపాడుకోవచ్చని చెప్పారు. యోగా, వాకింగ్, సూర్య నమస్కారాలు చేస్తే రోజువారీ పనులను మరింత చురుగ్గా చేసుకోవచ్చన్నారు. భారతదేశాన్ని చూసి

2



## సరిహద్దు మంచుకొండల్లో యోగా

- పాల్గొన్న సరిహద్దు బద్రతా బలగాలు

**శ్రీనగర్, జూన్ 21 (సమ సమాజం):** యోగాడేను సరిహద్దు భద్రతా దళాలు మంచుకొండల్లో జరుపుకున్నాయి. అంతర్జాతీయ సరిహద్దుల్లోని హిమాలయా పర్వతాలపై మంగళవారం ఉదయం ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) జవాన్లు యోగాసనాలు వేశారు. 8వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా లడఖ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, సిక్కిం, అస్సాంలతో సహా భారత్-చైనా సరిహద్దుల్లో ఐటీబీపీ జవాన్లు యోగా చేశారు.లడఖ్ ప్రాంతంలోని 17వేల అడుగుల ఎత్తున్న హిమాలయాలపై ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీసులు యోగా చేశారు.ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీసుకి చెందిన హిమ్‌వీర్లు సిక్కింలో మంచు పరిస్థితుల్లో 17,000 అడుగుల ఎత్తులో యోగా సాధన చేశారు.

## తెలంగాణ ఉద్యమంలో ఆచార్య జయశంకర్

- ఆయన స్ఫూర్తితోనే మరింత ముందుకు
- నివాళి అర్పించిన పలువురు నేతలు



**హైదరాబాద్, జూన్ 21 (సమ సమాజం):** తెలంగాణ కోసం జరిగిన మహోద్యమంలో ఆచార్య జయశంకర్ ఆద్యంతం అందరికీ స్ఫూర్తిగా నిలిచారని సీఎం కేసీఆర్ అన్నారు. బుధవారం జయశంకర్ వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఆయనను స్మరించుకున్నారు. తెలంగాణ ఉద్యమంలో చాలా చురుగ్గా పాల్గొన్నారని గుర్తు చేసుకున్నారు. సమైక్య ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన సమయంలోనే తెలంగాణ ప్రాంతానికి జరగనున్న అన్యాయంపై ఆచార్య జయశంకర్ మాట్లాడారని చెప్పారు. జీవితాంతం తెలంగాణ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయం, వివక్షపై తెలంగాణ ప్రజలను జాగృతం చేశారన్నారు. జయశంకర్ సార్ ఉద్యమ స్ఫూర్తితోనే రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుంటున్నామని తెలిపారు. సీఎం కేసీఆర్ దేశంలో ఎక్కడా లేని విధంగా పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని మంత్రి ఎర్రబెల్లి దయార్ రావు అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ ఆశయ సాధన కోసం ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణను బంగారు తెలంగాణగా తీర్చిదిద్దేందుకు నిరంతరం శ్రమిస్తున్నారని చెప్పారు. ఇప్పుడు జయశంకర్ సర్ ఉంటే తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధిని చూసి సీఎం కేసీఆర్‌ను

2

## బాసరలో క్లాసు బాట పట్టిన విద్యార్థులు

- మంత్రి సబిత హామీతో ఆందోళన విరమణ
- ట్రిపుల్ ఐటి విద్యార్థుల ఆందోళనతో దిగివచ్చిన ప్రభుత్వం



**నిర్మల్, జూన్ 21 (సమ సమాజం):** బాసర ట్రిపుల్ ఐటీలో మంగళవారం తిరిగి తరగతులు ప్రారంభమయ్యాయి. విద్యాశాఖ మంత్రి సబిత ఇంద్రారెడ్డితో సోమవారం అర్ధరాత్రి వరకు జరిగిన చర్చలు సఫలం కావడంతో విద్యార్థులు తమ ఆందోళన విరమిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో మంగళవారం 7 రోజుల ఆందోళన అనంతరం క్లాసులకు హాజరయ్యారు. నెలరోజుల్లో సమస్యలన్నీ పరిష్కరిస్తామని, అలాగే అతిత్వరలోనే రెగ్యులర్ వైస్ ఛాన్స్ లర్ ను నియమిస్తామని.. 15 రోజుల్లో మళ్లీ క్యాంపస్‌కు వస్తానని మంత్రి హామీతో విద్యార్థులు సంతృప్తి

2

## ఆమంచికి మరోమారు నోటీసులు



**బాపట్ల, జూన్ 21 (సమ సమాజం):** చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్కు సీబీఐమరోసారి నోటీసులు జారీ చేసింది. న్యాయ వ్యవస్థపై చేసిన వ్యాఖ్యలకు సంబంధించి విచారణకు రావాలంటూ ఆమంచికి నోటీసు ఇచ్చారు. సీఆర్పీసీ సెక్షన్ 41 కింద నోటిసు ఇచ్చిన సీబీఐ... రేపు విచారణకు హాజరుకావాలంటూ పేర్కొంది. ఇదే అంశానికి సంబంధించి గతంలో విశాఖలో సీబీఐ ముందు ఆమంచి కృష్ణ మోహన్ హాజరైన విషయం తెలిసిందే.

## తలాపూర్ ఫ్లై ఓర్‌ను మంత్రి కేటీఆర్ ప్రారంభం



**హైదరాబాద్, జూన్ 21 (సమ సమాజం):** నగరంలోని కైతలాపూర్ ఫ్లై ఓర్‌ను మంత్రి కేటీఆర్ మంగళవారం ప్రారంభించారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో దీనిని రూ.86 కోట్ల వ్యయంతో జీహెచ్‌ఎంసీ నిర్మించింది. ఈ ఫ్లై ఓర్‌తో కూకట్‌పల్లి, హైటెక్ సిటీల మధ్య సాఫీ ప్రయాణం సాధ్యం కానుంది. జేఎన్టీయూ జంక్షన్, మలేషియన్ టౌన్ షిప్ జంక్షన్, హైటెక్ సిటీ ఫ్లై ఓర్ , సైబర్ టవర్ జంక్షన్ల వద్ద ట్రాఫిక్ చిక్కులు తగ్గనున్నాయి. సనత్‌నగర్, బాలానగర్ మీదుగా సికింద్రాబాద్ వరకు 3.50 కిలో మీటర్ల ప్రయాణ దూరభారం తగ్గనుంది.

# సంపాదకీయం

## ఆర్మీలో కాదు....రాజకీయాల్లో అగ్నిపథ్ రావాలి !

అగ్నిపథ్ పథకాన్ని ఓ పెద్ద సంస్కరణగా ప్రధాని మోడీ భావిస్తున్నారు. సంస్కరణలు భవిష్యత్‌లో మంచి ఫలితాలు ఇస్తాయని, కనుక వీటి వెనక ఆందోళనలకు వెరవాల్సిన అసవరం లేదని చెప్పుకొచ్చారు. దేశంలో అగ్నిపథ్ ఆందోళనల నేపథ్యంలో ఆయన తన మనోగతాన్ని కుండబద్దలు కొట్టారు. సాగుచట్టాల విషయంలోనూ ఇదే విధానం ప్రకటించారు. మోడీ తన పాలనలో మంచి అంటున్న ఏ విషయంలో అయినా చర్చించరు. ఎలా మంచి జరుగుతుందో చెప్పరు. కనీసం తోటి మంత్రులతో అయినా చర్చిస్తారా అంటే చర్చించరు. పార్లమెంటును విశ్వాసంలోకి తీసుకోరు. సాగుచట్టాల విషయంలోనూ ఇదే జరిగింది. జిఎస్టీ విషయంలోనూ ఇదే జరిగింది. నోట్ల రద్దు విషయంలోనూ ఇదే జరిగింది. లాక్‌డౌన్ విషయంలోనూ ఇదే జరిగింది. ఇప్పుడు కూడా అదే విషయాన్ని ప్రకటించారు. ఎందుకు..ఎలా అన్నదానికి సమాధానం దొరకదు. ఇలా ప్రభుత్వమే కాంట్రాక్ట్ విధానం అవలంబిస్తే ఇక ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహించిన వారం అవుతామే తప్ప మరోటి కాదు. ఈ ప్రమాదాన్ని ప్రధాని గుర్తించడం లేదు. 40 ఏళ్ల జీవితాన్ని నాలుగేళ్లలో ముగిం చండి అంటున్న మోడీ ..రాజకీయంగా కూడా నాలుగేళ్ల పరిమితులు పెడితే బాగుంటుంది. రాజకీయంగా ఎవరు కూడా నాలుగేళ్లకు మించి పదవిలో ఉండకుండా చట్టం చేయాలి. ఒక్కరు ఒకే దఫా పదవిలో ఉండాలి. ఎమ్మెల్యే కావచ్చు..ఎంపి కావచ్చు.. లేదా ప్రధాని కావచ్చు.. ఇలా చేసి ప్రయోగాత్మకంగా అవంబించాలి. అలాగే ప్రజాప్రతినిధుల పెన్షన్ ఎత్తేయాలి. వారికి ఇతరత్రా ఇస్తున్న అలవెన్సులు రద్దు చేయాలి. దేశం కోసం ప్రతి ఒక్కరూ ఓ నాలుగేళ్ల పాటు రాజకీయ అవకాశం పొందేలా చేయాలి. అప్పుడు దేశం కూడా బాగు పడుతుంది. రాజకీయంగా అగ్నిపథ్ పథకం ముందు ప్రవేశ పెట్టి అమలు చేసే దమ్ము మోడీకి ఉందని నిరూపించాలి. అప్పుడు వరాసత్వ రాజకీయాలను కూడా నిర్మూలించవచ్చు. రాజకీయాల్లో వారసత్వాలకు అవకాశం లేకుండా కూడా నిర్దేశించాలి. ఇదే పెద్ద సంస్కరణ కాగలదు. ఇది దేశ భవిష్యత్‌కు పునాది కాగలదు. రాజకీయంగా ఎలాంటి లాభాపేక్ష లేకుండా నాలుగేళ్ల పాటు ఎవరైనా సేవ చేసేలా రాజ్యాంగాన్ని సవరించాలి. పదవులను పట్టుకుని ఎంపిలుగా, ఎమ్మెల్యేలుగా వరుసగా నిలబడే విధానం పోవాలి. ఇక్కడే అగ్నిపథ్ పథకం రావాలి. అప్పుడు మోడీ సంస్కరణలపై ప్రజలకు విశ్వాసం కలుగుతుంది. సంస్కరణలు తిండి పెట్టాలే తప్ప పస్తులుండేలా..నిరుద్యోగాన్ని పెంచేలా..రోడ్డున పడేసేలా ఉండరాదు. నిజానికి దేశంలో రాజకీయ రిజర్వేషన్లు రావాలి. ఒక్కరు ఒక్కసారి మాత్రమే పదవి పొందేలా..అదికూడా దేశం కోసం ఎలాంటి జీతభత్యాలు లేకుండా పనిచేసేలా చేయాలి. రాజీకాయలను లాభసాటిగా మార్చి.. పదవులను పట్టుకుని వేలాడుతున్న వారు తమకు అనుకూలంగా చట్టాలు చేస్తూ పోతుంటే దేశం ఏమవు తుందో ఏనాడూ ఆలోచించడం లేదు. నిజానికి ఏటా రాజకీయ పదవుల కారణంగా ఎంత ఖర్చవుతుందో లెక్క తీయాలి. పెన్షన్లకు ఎంత ఇస్తున్నారో లెక్క తీయాలి. ఈ దుబారాను అరికట్టగలిగితే దేశం తప్పకుండా బాగుపడు తుంది. ఆజాదీకా అమృత్ మహోత్సవాలు ఏటా జరుపుకోవచ్చు. దేశంలో ప్రజల ఆందోళనలు అర్థం చేసు కోకుండా పాలన సాగిస్తున్నంత కాలం దేశం ఎప్పటికీ కుదురుకోదు. ఓ వైపు అన్నమో రామచంద్రా అని ప్రజలు అల్లాడుతున్నా..ఆందోళను చేస్తున్నా ..నిరుద్యోగం పెరుగుతున్నా..నాలుగేళ్ల పేరుతో సైన్యంలో ఉద్యోగాలు కల్పిస్తే..వారికి దేశం మీద ఏపాటి భక్తి ఉంటుందో గమనించాలి. ప్రైవేట్ రంగం కూడా ఇదే విధానం అవలంబిస్తే దేశం ఏమవుతుందో ఊహించారా అన్నది మోడీ చెప్పాలి. అడుగ డుగునా అభ్యంత రాలు వ్యక్తమవుతున్నా.. దేశవ్యాప్తంగా ఆందోళనలు, నిరసనలు జరుగుతున్నా.. అన్నింటినీ తోసిరాజని 'అగ్నిపథ్'పై మోదీ ప్రభుత్వం అడుగు ముందుకే అన్న తీరుగా సాగుతున్న వైనం సరికాదు. ఇకపోతే నిర్ణీత షెడ్యూలు ప్రకారం.. అగ్నిపథ్‌లో భాగంగా ఆర్మీలో పలు పోస్టులకు నోటిఫికేషన్ విడుదల అయింది. అగ్నివీరుల అర్హతలు, సర్వీసులో వారికి అందే వేతనాలు, ఇతర ప్రోత్సాహకాల గురించి ప్రస్తావిస్తూ ఆర్మీ చీఫ్ జనరల్ మనోజ్ పాండే పేరిట ఈ నోటిఫికేషన్ విడులైంది. జూలై నుంచి రిజిస్ట్రేషన్ పక్రియ మొదలవుతుందని అందులో పేర్కొన్నారు. ఈ నోటిఫికేషన్ ప్రకారం ఆర్మీ అభ్యర్థులు సైనిక చట్టం- 1950 కింద తమ పేర్లు నమోదు చేసుకోవాలి. శిక్షణతో కలుపుకొని మొత్తం సర్వీసు నాలుగేళు .. భూ, సముద్ర, గగనతల విభాగాల్లో ఎక్కడైనా పనిచేయడానికి అగ్నివీరులు సిద్ధపడాలి. సర్వీసు పూర్తిచేసుకున్న వారికి పింఛను,గ్రాట్యుటీ ఇవ్వరు. ఇదే తరహాలో ఇప్పుడు రాష్ట్రపతి,ప్రధాని,మంత్రులు మొదలు, ఎంపిలు, ఎమ్మెల్యేలకు కూడా ఎన్నికల సంఘం ప్రత్యేక నోటిఫికేషన్ ఇవ్వాలి. పదవులను కుదించాలి. సాధారణ పౌరుడుగా ఉన్న వారెవరైనా వయోపరిమితి మేరకు ఎంపిగా,ఎమ్మెల్యేగా ఒక్కసారి మాత్రమే ..అదికూడా నాలుగేళ్లు మాత్రమే పదవిలో కొనసాగేలా అగ్నిపథ్ పథకాన్ని తీసుకునిరావాలి. అప్పుడే సంస్కరణలకు అర్థం ఉంటుంది. దేశ పురోభివృద్ధికి ఇది పునాది కాగలదు. దేశంలో అవినీతి తగ్గగలదు. ప్రజలకు మేలు చేసే నిర్ణయాలు రావచ్చు. ఎందరో త్యాగధనలుఉ తమ ఆస్తిపాస్తులును అమ్ముకుని, త్యాగం చేసి దేశం కోసం పోరాడి స్వరాజ్యం తెచ్చారు. కానీ తరవాతి కాలంలో వచ్చిన వారు తమకు అనుకూలంగా చట్టాలు చేస్తూ పోతున్నారు. ప్రజలు పాలకలు కాళ్లూ వేళ్లు పట్టుకునేలా చేస్తున్నారు. ప్రజలు అడుక్కునే బిచ్చగాళ్లు గా చూస్తున్నారు. దేశ సంపదను కొల్లగొడుతున్నారు. ప్రత్యేక విమానాలు, ప్రత్యే అలవెన్సులు, ఖర్చులు, విదేశీ పర్యటనలు ఇలా..చెప్పుకొంటూ పోతే లక్షల కోట్ల ధనం వృధా అవుతోంది. రాజకీయంగా ఖర్చు చేస్తున్న మొత్తాన్ని దేశ అవసరాలకు వినియోగించవచ్చు. రాజకీయ దుబారా అరికట్ట గలిగితే దేశం సంక్షేమంతో ముందుకు సాగగలదు. అప్పుడు కర్షకులు బాగు పడతారు. ప్రజలు బాగుపడ తారు. దేశంలో నిరుద్యోగం ఉండదు. ఏటా నోటిఫికేషన్లు వస్తాయి. ధరలు దిగివస్తాయి. కాబట్టి ప్రజలతంతా ముక్తకంఠంతో రాజకీయ అగ్నిపథ్ పథకం కోసం డిమాండ్ చేయాలి. అలా తీసుకుని వచ్చేలా పోరాడాలి. అప్పుడే దేశానికి దశదిశ ఏర్పడుతుంది. సమస్యలు ఉండవు. ప్రపంచ దేశాలతో పోటీపడి ముందు వరసలో నిలబడతాం.

పృద్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# త్వరలోనే కొత్త పెన్షన్లు..రేషన్ కార్డులు

- పజలకు శుభవార్త చెప్పిన మంత్రి కెటిఆర్
- కైతలాపూర్ ఫ్లైవో ఓవర్ ప్రారంభోత్సవంలో కెటిఆర్
- కెసిఆర్ సిఎం అవుతారంటూ మరోమారు వివేకానంద పల్లవి



**హైదరాబాద్, జూన్ 21 (సమ సమాజం):** రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు రాష్ట్ర ప్రజలకు శుభవార్త చెప్పారు. త్వరలోనే కొత్త పెన్షన్లతో పాటు రేషన్‌కార్డులు జారీ చేయనున్నట్లు ప్రకటించారు. నగర పరిధిలో కైతలాపూర్ ఫ్లైఓవర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని మాట్లాడారు. ఇప్పటి వరకు మంచినీటి సదుపాయం, రోడ్లు, కరెంటు, పార్కులు, వైకుంఠధామాలు బాగు చేసుకున్నామని, బస్తీల్లో ఉండే పేదలకు సుస్తీ అయితే.. బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. అన్నపూర్ణ సెంటర్లు ఏర్పాటు చేసుకున్నామన్నారు. ఇప్పుడు 'మన బస్తీ మన బడి' కార్యక్రమంలో పాఠశాలలు బాగు చేసుకుంటున్నామని, ఒక్కొక్కటిగా పనులు చేసుకుంటూ ముందుకెళ్తున్నట్లు కేటీఆర్ పేర్కొన్నారు. 'ఎమ్మెల్యే కృష్ణారెడ్డి 57 సంవత్సరాలకే పెన్షన్ ఇస్తామని చెప్పామని.. వెంటనే ఇవ్వాలని కోరారన్నారు. అతి త్వరలోనే పింఛన్ల పంపిణీని ప్రారంభిస్తామని కేటీఆర్ ప్రకటించారు. 'మీ శాసనసభ్యుడు, కార్పొరేట్ల చేతుల మీదుగా.. మీరు ఎక్కడ తిరిగే అవసరం లేకుండా.. ఎవరి చుట్టూ తిరిగే అవసరం లేకుండా మీ బస్తీమే.. మీ కార్పొరేటరే వచ్చి.. ఎవరు ఎవరు అర్హులున్నారో ఒక్కరూ మిస్ కాకుండా ఇచ్చే బాధ్యత మాది. ఈ విషయంలో ఎవరికీ అనుమానం అవసరం లేదు. ఎందుకంటే తెలంగాణ ప్రభుత్వం రాక ముందు ఈ రాష్ట్రంలో 29లక్షల మందికి మాత్రమే పెన్షన్ వచ్చేది. రూ.200, రూ.500 పెన్షన్ వచ్చేది. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక 40లక్షల మందికి పెన్షన్లు వస్తున్నయ్. రూ.200 పెన్షన్ పది రెట్లు పెరిగి రూ.2000 అయ్యింది. రూ.500 పెన్షన్ ఆరు రెట్లు పెరిగి.. రూ.3వేలు అయ్యింది. సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం.. ఆ నాడు ప్రభుత్వం పెన్షన్ల కోసం రూ.800కోట్లు ఖర్చు చేస్తే.. తెలంగాణ ప్రభుత్వంలో రూ.10వేలకోట్లకుపైగా ఖర్చు పెడుతున్నం. మరో మూడు నాలుగు లక్షల మందికి పెన్షన్లు ఇవ్వడం ప్రభుత్వానికి పెద్ద సమస్య కాదు. ఈ ప్రభుత్వం ఉన్న పేదవారి కోసం. మీ మొఖంలో చిరునవ్వు చూడడమే మా లక్ష్యం. మూసాపేట, అల్లాపూర్, ఓల్డ్ బోయినపల్లి, ఫతేనగర్ కావచ్చు.. మరే డివిజనే కావచ్చు.. మీ కార్పొరేటరే.. మీ బస్తీకే, మీ వద్దకు వచ్చి మీ చేతిలో పెన్షన్ పెట్టించే బాధ్యత, తొందరలో అప్పజెప్పే బాధ్యత నాది. గత రెండు సంవత్సరాలుగా కరోనాతో ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం కావడంతో కొత్త రేషన్ కార్డుల జారీలో కొంత ఆలస్యమైంది. కొత్త రేషన్‌కార్డులు, కొత్త పెన్షన్లు ఇస్తాం. అలాగే డబుల్ బెడ్రూం ఇండ్లు అందజేస్తాం. ఇవాళైనా, రేపైనా జీహెచ్ఎంసీ మేయర్, అధికారులతో సమావేశమై కార్యక్రమాన్ని మొదలు పెడుతాం. పారదర్శకంగా లాటరీ తీసి ఇండ్లు అందజేస్తాం. భారతదేశంలో ఏ రాష్ట్రంలో 28 రాష్టాల్లో డబుల్ బెడ్రూం ఇండ్లు అనే కార్యక్రమం లేదు. మోదీ సొంత రాష్ట్రమైన గుజరాత్‌లోనూ లేదు. హైదరాబాద్‌లో కట్టిన ఇండ్లు రూ.30 నుంచి రూ.50లక్షల విలువ ఉంటుంది. అలాంటి ఇండ్లు ఉచితంగా ఇచ్చే సమయంలో ఆలోచించి పారదర్శకంగా జాగ్రత్తగా అర్హులకు అందజేస్తాం' అని మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు.రానున్న రోజుల్లో కేటీఆర్ రాష్ట్ర ముఖ్యమంత్రి అవుతారని, కేసీఆర్ ఢిల్లీలో జాతీయ స్థాయిలో చక్రం తిప్పుతారని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేక్ పేర్కొన్నారు. కైతలాపూర్ ఆర్వోబి ప్రారంభోత్సవ సందర్భంగా టీఆర్ఎస్ నాయకులు భారీ బహిరంగ సభ నిర్వహించారు. మంత్రులు కేటీఆర్, మల్లారెడ్డి, నగర మేయర్ గద్వాల విజయ లక్ష్మి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. సందర్భంగా కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేక్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీఆర్ఎస్ విజయం తథ్యం అన్నారు. కేసీఆర్ ఢిల్లీలో జాతీయ స్థాయిలో చక్రం తిప్పుతారని, కేటీఆర్ రాష్ట్ర ముఖ్యమంత్రి అవుతారని జోస్యం చెప్పారు. మంత్రి కేటీఆర్ సమక్షంలోనే ఎమ్మెల్యే వివేక్ చేసిన వ్యాఖ్యలకు కార్యకర్తలు చప్పట్లు కొడుతూ ఈలలు, కేకలతో స్వాగతించారు.

# అగ్నిపథ్ ఆందోళనలపై ఉక్కుపాదం

**బిజెపి తీరుపై మండిపడ్డ మంత్రి హరీష్ రావు**

**16లక్షల ఖాళీల భర్తీలో బిజెపి నిర్లక్ష్యం**

**మంథనిలో మాతాశిశు సంరక్షణ కేందరం ప్రారంభం**



**పెద్దపల్లి, జూన్ 21 (సమ సమాజం):** అగ్నిపథ్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్న నిరుద్యోగ యువతపై బీజేపీ అక్రమ కేసులు బనాయించి, బెదిరింపులకు పాల్పడటం సరికాదని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. దేశాభివృద్ధిని కేంద్రం గాలికి వదిలేసిందన్నారు. మరో ఏడాదిలో ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో బీజేపీ మత విద్వేషాలను రెచ్చగొడుతూ రాజకీయంగా లబ్ది పొందే ప్రయత్నం చేస్తోందని హరీశ్‌రావు మండిపడ్డారు.మంథనిలో మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని మంత్రులు హరీశ్‌రావు, కొప్పుల ఈశ్వర్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. బీజేపీ అన్యాయాలను ఈ దేశ యువత సహించలేకపోతుందన్నారు. దేశంలో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయడంలో కేంద్రం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. కేంద్రంలోని ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ అమ్మి సొమ్ము చేసుకుంటోందని ధ్వజమెత్తారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో ఏడేండ్లలోనే ఇరిగేషన్, ఎడ్యుకేషన్, మెడికల్‌తో పాటు అన్ని రంగాల్లో గణనీయమైన అభివృద్ధి సాధించామని మంత్రి తెలిపారు. కొత్తగా రాష్ట్రంలో 30 వైద్య కాలేజీల ఏర్పాటు చేశామన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కొత్తగా నాలుగు వైద్య కళాశాలలను అందుబాటులోకి తీసుకొచ్చామని హరీశ్‌రావు తెలిపారు. బీజేపీ అధికారంలో ఉన్న ఏ రాష్ట్రంలోనూ వైద్యం అందట్లేదని మంత్రి హరీష్ రావు అన్నారు. బీజేపీది డబుల్ ఇంజన్ కాదు ట్రబుల్ ఇంజన్ సర్కార్ అని వ్యాఖ్యానించారు. అగ్నిపథ్ పథకంతో నిరుద్యోగుల ఆశలపై నీళ్లుచల్లారని మండిపడ్డారు. మత విద్వేషాలు రెచ్చగొట్టడం తప్ప అభివృద్ధి ఏమి లేదన్నారు. సికింద్రాబాద్ ఘటన కేసీఆర్ చేయించారని బీజేపీ నేతలు అంటున్నారని... మరి ఉత్తర్‌ప్రదేశ్‌లో పోలీస్ స్టేషన్ తగులబెట్టారు అక్కడ ఏ ప్రభుత్వం ఉంది అని మంత్రి హరీష్ రావు ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేత, మహిళా కమిషన్ సభ్యురాలు కటారి రేవతి రావు, ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, దాసరి మనోహర్ రెడ్డి, పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధు, భూపాలపల్లి జడ్పీ చైర్ పర్సన్ శ్రీ హర్షినిలు పాల్గొన్నారు.



## ప్రపంచ వ్యాప్తంగా యోగా డే ఉత్సవాలు




(మొదటి పేజి తరువాయి) వివిధ దేశాలు యోగాను నేర్చుకుంటాయని తెలిపారు. ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో గర్భిణులకు యోగాలాంటి శిక్షణ ఇస్తున్నామని, గర్భిణులు యోగాలాంటివి చేస్తే నార్మల్ డెలివరీ అయ్యే అవకాశం ఉంటుందన్నారు. చెప్పారన్నారు. యోగాతో ప్రపంచానికి శాంతి లభిస్తుందన్నారు. యోగా మనల్ని బలవంతులుగా చేస్తుందన్నారు. యోగా ప్రజలను, దేశాలను కలుపుతుందని మోడీ అన్నారు. 75 చారిత్రక ప్రాంతాల్లో యోగా ఉత్సవాలు జరుగుతున్నాయని చెప్పారు. యోగా డే ప్రపంచవ్యాప్తంగా పండుగలా మారిందని గుర్తు చేశారు. ఆరోగ్యం, శాంతి, సంతోషానికి సూచిక యోగా అని అన్నారు. కొన్నేళ్ల క్రితం అయితే ఆధ్యాత్మిక కేంద్రాల్లోనే యోగా కనిపించేదని, కానీ ప్రస్తుతం ప్రపంచం నలుమూలలా విస్తరించిందన్నారు. యోగా సందేశాన్ని సకల మానవాళికి చేరవేయాలని మోడీ తెలిపారు. ప్రధానితో పాటుగా కేంద్ర ఆయుష్ మంత్రి సర్బానంద సోనోవాల్, కర్ణాటక గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్, ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై కూడా ఈ కార్యక్రమలో పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమంలో ఆచార్య జయశంకర్



(మొదటి పేజి తరువాయి)అభినందించే వారన్నారు. ప్రభుత్వం చేసే అభివృద్ధిని చూసి ఓర్వలేకనే విపక్షాలు విమర్శలు చేస్తున్నాయన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ కలలుగన్న తెలంగాణ సాధనే లక్ష్యంగా సిఎం కెసిఆర్ పనిచేస్తున్నానని ఎమ్మెల్సీ కడియం శ్రీహరి అన్నారు. కుల వృత్తుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వర్థంతి సందర్భంగా వరంగల్‌లో ఆచార్య జయశంకర్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. తెలంగాణ భవన్ లో ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. తెలంగాణ సాధన కోసం జయశంకర్ సార్ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. సార్ చూపిన బాటలో పయనిస్తామన్నారు.

# తెలంగాణ ఐకాన్ ఆచార్య జయశంకర్

**ఘనంగా నివాళి అర్పించిన మంత్రి**



**సూర్యాపేట, జూన్ 21 (సమ సమాజం):** తెలంగాణకు దివంగత ఆచార్య జయశంకర్ సార్ ఐకాన్ లాంటి వారని విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డి కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవిత చరమాంకం వరకు అవిశ్రాంతంగా పోరాటం చేసిన యోధుడు అని ఆయన పేర్కొన్నారు. జయశంకర్ 11 వ వర్థంతిని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం మంత్రి జగదీష్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణను ఆంధ్రప్రదేశ్‌లో కలిపిన రోజునే బలంగా వ్యతిరేకించిన యోధుడు జయశంకర్ సార్ అని ఆయన తెలిపారు. అలాంటి మహానుబావుడి సంకల్పసిద్ధికి అనుగుణంగా ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనను కొనసాగిస్తున్నార న్నారు. ఈ రోజున సార్ జీవించి ఉంటే ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో తాను కన్న కలలు సాకారం అవుతున్నందుకు ఎంతగానే సంబురపడేవారని మంత్రి చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్ దార్శనికత తోటే రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి సాదించిందన్నారు. అంతకు మించి వేగవంతమైన వ్యవసాయ అభివృద్ధి, విద్యుత్ రంగంలో సాధించిన అద్భుతమైన విజయాలు సాధించాం. పారిశ్రామిక రంగంలో కొత్తగా ప్రకటించిన పాలసీ ప్రపంచాన్ని ఆకర్షిస్తోంది అంటే జయశంకర్ సార్ ఆలోచనలకు అనుగుణంగా సీఎం కేసీఆర్ చేస్తున్న పాలనకు నిదర్శనమని మంత్రి కొనియాడారు.

# ఆరోగ్యం కోసం యోగా చేయాల్సిందే

**యోగా ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రి శ్రీనివాసగౌడ్**




**మహబూబ్‌నగర్, జూన్ 21 (సమ సమాజం):** ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ యోగా చేయాలని రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ సూచించారు. అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకొని మహబూబూబ్ నగర్ పట్టణంలోని రాయల్ ఫంక్షన్ హాలులో, రంగారెడ్డి జిల్లా అజీజ్ నగర్ లో కేఎల్ యూనివర్సిటీ, న్యూమాంక్స్ కుంగ్ ఫూ ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాల్లో మంత్రి శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. విద్యార్థులకు ఆటలపై ఆసక్తి, అంతర్జాతీయ స్థాయిలో రాణించే అవకాశాలు కల్పించేందుకు క్రీడా మైదానాలు ఏర్పాటు చేస్తున్నామని ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ గౌడ్ వెల్లడించారు. సినీ నటుడు నరేష్ తో కేఎల్ యూనివర్సిటీలో జరిగిన యోగాడేలో మంత్రి శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. విద్యార్థులను ఉత్సాహ పరుస్తూ మంత్రి శ్రీనివాస్ గౌడ్ కొద్దిసేపు వారితో ముచ్చటించారు. అబ్రహం లింకన్, అబ్దుల్ కలాం వంటి మహనీయులు నిరుపేద కుటుంబాల నుంచి వచ్చిన వారేనని.. వారు చిన్న తనంలో కిలోమీటర్ల దూరం నడచి స్కూళ్లకు వెళ్లారని గుర్తు చేశారు. జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగిన మహనీయులందరూ చిన్నప్పటి నుంచి కష్టపడి క్రమశిక్షణతో చదువుకున్న వారేనని తెలిపారు. యోగా ప్రాముఖ్యతను ప్రపంచ వ్యాప్తంగా అందరూ గుర్తించి దైనందిన జీవితంలో యోగాను ఒక భాగం చేసుకోవాలని ప్రయత్నిస్తున్నాయని మంత్రి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. అమెరికా వంటి దేశాల్లో యోగా క్లాసులు నిర్వహిస్తే.. యోగా నేర్పించే గురువులకు మంచి గుర్తింపుతోపాటు అత్యధిక వేతనాలు ఇస్తున్న పరిస్థితి ఉందని మంత్రి శ్రీనివాస్ గౌడ్ వివరించారు.

# బాసరలో క్లాసు బాట పట్టిన విద్యార్థులు

(మొదటి పేజి తరువాయి) వ్యక్తం చేశారు. రాత్రి 9.30 నుంచి ఇంచార్జ్ వీసీ రాహుల్ బొజ్జాతో కలసి మంత్రి సబితా ఇంద్రారెడ్డి రెండున్నర గంటలకుపైగా సుదీర్ఘంగా చర్చలు జరిపారు. విద్యార్థులకు ల్యాప్‌టాప్స్ పంపిణీ చేస్తామని, నాణ్యమైన ఆహారం అందించడం సహా అన్ని సమస్యలు పరిష్కరిస్తామన్న మంత్రి హామీతో స్టూడెంట్స్ తమ ఆందోళన విరమించి క్లాసులకు హాజరయ్యారు. మొక్కవోని ధైర్యంతో వారం రోజులుగా.. చారిత్రక స్థాయిలో బాసర ట్రిపుల్? ఐటీ విద్యార్థులు నిర్వహించిన ఆందోళన చర్చనీయాంశం అయింది. తెలంగాణ ఉద్యమాన్ని గుర్తు తెచ్చే రీతిలో మొక్కవోని ధైర్యంతో ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ.. విద్యార్థులు 7 రోజులపాటు నిర్వహించిన ఆందోళన ప్రభుత్వాన్ని కదిలించింది. గతంలో ఎన్నడూ లేని రీతిలో .. తెలంగాణ ఉద్యమ సమయంలో కూడా లేనంతగా క్యాంపస్ బయట కొద్దిరోజులుగా వందలాది మంది పోలీసులను మోహరించడం, స్టూడెంట్లకు మద్దతు తెలిపేందుకు వచ్చేవాళ్లను అరెస్ట్ చేయడం వంటి పరిణామాలపై అందరి దృష్టిని ఆకర్షించింది. స్టూడెంట్ల సమస్యలు తెలుసుకునేందుకు వచ్చిన ప్రతిపక్ష పార్టీల లీడర్లను, విద్యార్థి సంఘాల నేతలను, ఆఖరికి విద్యార్థుల తల్లిదండ్రులను కూడా పోలీసులు ఎప్పటికప్పుడు అరెస్ట్ చేయడం తదితర చర్యలు తెలుగు గడ్డపై చర్చనీయాంశం అయ్యాయి. ఎట్టకేలకు ఆందోళన ముగించి ఇవాళ తరగతులు ప్రారంభం కావడంతో విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు అందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# జిల్లాలో జోరుగా వానలు



**రంగారెడ్డి, జూన్ 21 (సమ సమాజం):** జిల్లావ్యాప్తంగా సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు భారీ వర్షం కురిసింది. నైరుతి రుతుపవనాల ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా వాన దంచి కొట్టింది. ఈసీ, మూసీ నదులకు వరద పోటెత్తింది. వరదలతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.పలు చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. చేవెళ్ల మండలం తంగేడుపల్లి వద్ద వరద ఉధృతికి నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి కొట్టుకుపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అప్రమత్తమైన అధికారులు సహాయ కార్యక్రమాలు చేపట్టారు.

# పట్టుదలతో చదివి పైకి రావాలి: ఎర్రబెల్లి



**జనగామ, జూన్ 21 (సమ సమాజం):** పట్టుదలతో చదవాలి. అనుకున్న లక్ష్యాన్ని సాధించాలి. అప్పటి వరకు విశ్రమించొద్దని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. పాలకుర్తిలో ఎర్రబెల్లి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కోచింగ్ సెంటర్‌ను మంత్రి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గ్రూప్స్ కోచింగ్ మెటీరియల్ను పంపిణీ చేశారు. ఆచార్య జయశంకర్ సార్ చిత్రపటానికి పూల మాల వేసి పుష్పాంజలి ఘటించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. చాలా ఏండ్లుగా ఎర్రబెల్లి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్ నిర్వహిస్తున్నాం. పాలకుర్తి నియోజకవర్గంలోని తొర్రూరు, పాలకుర్తి కేంద్రాలుగా టెట్, గ్రూప్స్, పోలీసు ఉద్యోగాలకు ఇచ్చిన శిక్షణ వల్ల అనేక మంది ఉద్యోగాలు సాధించారని మంత్రి తెలిపారు. విద్యార్థులు బాగా చదివి తమ లక్ష్యాలను నెరవేర్చుకోవాలని మంత్రి సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధులు,

# రాష్ట్రపతి అభ్యర్థిగా వెంకయ్యనాయుడు ?

- నాయుడు నివాసంలో బిజెపి అగ్రనేతల భేటీ
- వెంకయ్యతో భేటీ అయిన అమిత్ షా, నడ్డా, రాజ్‌నాథ్ సింగ్
- హైదరాబాద్ నుంచి హుటాహుటిని ఢిల్లీకి వెళ్లిన వెంకయ్య
- సాయంత్రి బిజెపి పార్లమెంటరీ బోర్డు సమావేశం



**న్యూఢిల్లీ, జూన్ 21 (సమ సమాజం):** అధికార పక్షం తరపున రాష్ట్రపతి అభ్యర్థిగా ఎవరిని నిలబెడతారనే చర్చ జోరందుకుంది. ఈ తరుణంలో.. ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుతో జేపీ నడ్డా, అమిత్ షా భేటీ అయినట్లు సమాచారం. మంగళవారం వెంకయ్యనాయుడుని కలిసి.. హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా చర్చించారు. ఈ తరుణంలో.. రాష్ట్రపతి రేసులో వెంకయ్యనాయుడును నిలబెడతారా అనే చర్చ మొదలైంది. రాష్ట్రపతి ఎన్నికల వేళ దిల్లీలోని వెంకయ్య నాయుడు నివాసం కీలక భేటీకి వేదికైంది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, భాజపా అధ్యక్షుడు జేపీ నడ్డా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్.. వెంకయ్యతో సమావేశమయ్యారు. రాష్ట్రపతి ఎన్నికల అభ్యర్థిగా అధికార పక్షం ఎవరిని బరిలోకి దించుతుందన్న ఉత్కంఠ మధ్య... ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడుతో భాజపా అగ్రనేతల భేటీ చర్చనీయాంశమైంది. దిల్లీలోని వెంకయ్య నివాసంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, భాజపా అధ్యక్షుడు జేపీ నడ్డా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్? సింగ్ సమావేశమయ్యారు. రాష్ట్రపతి అభ్యర్థిని నిర్ణయించేందుకు సాయంత్రం భాజపా పార్లమెంటరీ బోర్డు భేటీ జరగడానికి ముందు.. వెంకయ్య ఇంట్లో ఈ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. ఉదయం సికింద్రాబాద్‌లో యోగా దినోత్సవంలో పాల్గొన్న వెంకయ్య నాయుడు ఆ కార్యక్రమం పూర్తి కాగానే ఆయన హుటాహుటిన దిల్లీకి వెళ్లారు. కాసేపటికే అమిత్ షా, నడ్డా, రాజ్‌నాథ్ ఆయన్ను ఇంటికి వెళ్లి కలిశారు. వీరంతా భేటీ కావాలని ముందుగానే నిర్ణయించుకున్నారని, అందుకోసమే వెంకయ్య హైదరాబాద్ నుంచి దిల్లీ వెళ్లారని తెలిసింది. మరోవైపు... విపక్షాలు సైతం రాష్ట్రపతి అభ్యర్థిని నిర్ణయించేందుకు కసరత్తు ముమ్మరం చేశాయి. యశ్వంత్ సిన్హా పేరు దాదాపు ఖరారైనట్లు సమాచారం. ఈ ఉదయమే ఆయన టీఎంసీకి రాజీనామా చేయడం ఇందుకు ఊతమిస్తోంది. గతంలో ఉపరాష్ట్రపతి పదవి చేపట్టిన వాళ్లు.. రాష్ట్రపతిగానూ పదోన్నతి పొందిన దాఖలాలు ఉన్నాయి. ఉపరాష్ట్రపతులుగా చేసిన సర్వేపల్లి రాధాకృష్ణన్, జాకీర్ హుస్సేన్, వి.వి. గిరి, ఆర్. వెంకట్రామన్, డాక్టర్ శంకర్ దయాళ్ శర్మ, కె.ఆర్ నారాయణన్‌లు రాష్ట్రపతులయ్యారు. ఈ తరుణంలో.. ఇప్పుడు వెంకయ్యనాయుడుకు ఆ ఛాన్స్ దక్కవచ్చని, పైగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా.. రాష్ట్రపతి అభ్యర్థి నామినేషన్ల పర్వం మొదలై.. వారం గడుస్తున్నా ఇటు ఎన్డీయే, అటు విపక్షాల కూటమి అభ్యర్థిని అధికారికంగా ప్రకటించలేదు. విపక్షాలు మరోసారి భేటీ కానున్న తరుణంలో.. బీజేపీ కమిటీ మాత్రం అభ్యర్థి ఎవరనేది కనీసం హింట్ కూడా ఇవ్వలేదు. మంగళవారం రాత్రి 7 గంటలకు బీజేపీ పార్లమెంటరీ బోర్డ్ సమావేశం జరగనుంది. ఈ భేటీలో.. రాష్ట్రపతి అభ్యర్థిని ఖరారు చేయొచ్చని భావిస్తున్నారు. ఇక విపక్షాల తరపున యశ్వంత్ సిన్హా పేరు తెర మీదకు వచ్చింది. అయితే అందరి ఆమోదయోగ్యమైన పేరును ప్రకటిస్తామని సీపీఐ నేత డి రాజా చెప్తున్నారు. జులై 18వ తేదీన రాష్ట్రపతి ఎన్నిక జరగనుంది.

## జోగిపేటలో ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి వేడుకలు



**అందోల్, జూన్ 21 (సమ సమాజం):** సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గం జోగిపేట పరిధిలో తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ వర్ధంతి సందర్భంగా మంగళవారం పట్టణంలో టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ తొలిదశ మలిదశ ఉద్యమానికి స్ఫూర్తి ప్రదాత అని తెలంగాణ సాధన కోసం తన ఊపిరి ఉన్నంత వరకు క్షమించిన మహనీయులు కేసీఆర్ కి అన్నివిధాలా సలహా సూచనలు కెసిఆర్ తెలంగాణ సాధించడానికి దిక్సూచి జయశంకర్ అని గుర్తు చేశారు. జయశంకర్ సార్ ఆశయసాధనకు కృషి చేయాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గూడెం మల్లయ్య ఏఎంసీ మాజీ చైర్మన్ డి బి నాగభూషణం తెరాస నాయకులు చాపల వెంకటేశం శ్రీకాంత్ గాజుల అనిల్ కుమార్ అల్లే శ్రీకాంత్, డి .శివ, గణేష్ నాయికోటి అశోక్, దిలీప్ ,కృష్ణ, తలారి రమేష్, హనుమంతప్ప, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు సేవలు అందించడంలో రిసెప్షన్ అధికారి యొక్క పాత్ర కీలకమైనదని రోహిణి ప్రియదర్శిని ఐ.పి.ఎ.స



**మెదక్, జూన్ 21 (సమ సమాజం):** మెదక్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా యెస్.పి రోహిణి ప్రియదర్శిని ఐ.పి.ఎ.స్ జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ లలోని రిసెప్షన్ మరియు టెక్ టీం సిబ్బందికి ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా యెస్.పి మాట్లాడుతూ... పోలీస్ స్టేషన్ కు వివిధ రకాల అభ్యర్ధనలు/ ఫిర్యాదులు/ సమాచారం/ సహాయం కోసం వచ్చే ప్రతి ఒక్కరిని మర్యాదపూర్వకంగా ఆహ్వానించి తగు సేవలు అందించడంలో రిసెప్షన్ అధికారి యొక్క పాత్ర కీలకమైనదని, ప్రజలందరికీ పోలీస్ వ్యవస్థ పై నమ్మకం విశ్వాసం కల్పించడంలో రిసెప్షన్ అధికారి ముఖ్య పాత్ర వహిస్తారని తెలిపారు. రిసెప్షన్ అధికారి బాధితులతో మర్యాదపూర్వకంగా స్నేహపూర్వకంగా ప్రవర్తిస్తూ వారి పట్ల సానుభూతితో వ్యవహరించాలని తెలిపారు. వ్రాత పూర్వక ఫిర్యాదు విషయంలో ఫిర్యాదును సూక్ష్మంగా చదివి పిటిషన్ మేనేజ్మెంట్ సిస్టం సి.సి.టి.ఎన్.ఎస్. లో ఫిర్యాదులోని విషయాలను నమోదు చేయవలెను అని తెలిపారు. ఫిర్యాదుల తీవ్రతను బట్టి వెంటనే స్పందించి ఎస్సై దగ్గరికి గాని తన పై అధికారులకు గాని లేదా ఇతర వర్టికల్ అధికారులకు గాని తెలియజేసి తగు చర్యలు తీసుకునే విధంగా చూడవలెనని, ఫిర్యాదులను ఎస్ హెచ్ వో లేదా ఇంచార్జి అధికారులతో కలిపించి ఆ వివరములను మరియు తీసుకున్న చర్యల వివరాలను సి.సి.టి.ఎన్.ఎస్. పిటిషన్ మేనేజ్మెంట్ అప్లికేషన్ లో నమోదు చేయాలని తెలిపారు. రిసెప్షన్ వద్ద మరియు పోలీస్ స్టేషన్ ల పరిసరాలలో 5 సిస్టంను పాటిస్తూ పరిశుభ్రంగా ఉండునట

## వాహనాలు నడిపేటప్పుడు అప్రమత్తంగా ఉండడం మంచిది



**మెదక్, జూన్ 21 (సమ సమాజం):** మెదక్ జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని ఐ.పి.ఎ.స్ ఆదేశానుసారం రోడ్డు ప్రమాదాలు మరియు ట్రాఫిక్ నియమాలను గురించి, జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాలపై ప్రజల్లో అవగాహన కార్యక్రమంలో భాగంగా ఈ రోజు జిల్లా డి.సి.ఆర్.బి సి.ఐ బి.రవీందర్ మాట్లాడుతూ... చాలా వరకు రోడ్డు ప్రమాదాలు అతివేగం, ట్రాఫిక్ నియమాలను అనుసరించకపోవడం వల్ల జరుగుతున్నాయని అన్నారు. విడిగా ప్రతి వాహనదారులు ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణలో బాగస్వాములు కావాలని అన్నారు. రామాయంపేట పోలీసు స్టేషన్ పరిది తొనిగండ్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాద కారణాలను తెలియజేస్తూ తేదీ:14.06.2022 నాడు ఒక వ్యక్తి తన బార్యతో వ్యక్తిగత పనుల నిమిత్తం TS 35 F 8458 నెంబరు గల పల్సర్ బైక్‌పై అక్కన్నపేటకు వెళ్ళి అక్కడ పనులు ముగించుకుని తిరిగి వస్తుండగా మార్గమధ్యలో తొనిగండ్ల గ్రామ పరిధిలోని మద్దులకుంట చెరువు అలుగు దగ్గరకు సమయం 11:30 గంటలకు రాగానే తన ఎదురుగా వస్తున్న మరో బైక్ వ్యక్తి హారన్ వేయగానే తన వాహనాన్ని అదుపు చేసే క్రమంలో తాను నడుపుతున్న బైక్ డిస్క్ బ్రేక్ వేయగా బైక్ అదుపు తప్పి రోడ్డుపై జారిపోవడంతో ఇద్దరూ రోడ్డుపై పడిపోయారు, ఫలితంగా బైక్ నడుపుతున్న వ్యక్తికి భుజం, మోచేతి ఎడమ వైపు, పక్కటేముకలు మరియు మోకాళ్లపై తీవ్ర గాయాలయ్యాయి, ఈ గాయాల వల్ల అతడు చికిత్స పొందుతూ చనిపోయాడని అన్నారు. ఈ ప్రమాదాన్ని మరోసారి గమనించినట్లైతే 1) బైక్ నడుపుతున్న వ్యక్తి ఎదురుగా వస్తున్న వాహనాన్ని గమనించకపోవటం. 2). అకస్మాత్తుగా డిస్క్ బ్రేక్ వేయటం. కాబట్టి వాహనాన్ని నడిపేటప్పుడు హెల్మెట్ దరించి మీ చుట్టూ పక్కల వాహనాలను గమనించాలని అలాగే ఎవరైనా హారన్ కొడితే గాబరా పడిపోయి సడన్ బ్రేక్ వేయకుండా తమ వాహనాలను నిర్ణీత వేగంలో నడపాలని అలాగే ప్రతి వాహనదారుడు అతివేగంగా వాహనాలను నడపవద్దని ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ సురక్షితంగా తమ గమ్యాన్ని చేరాలని అన్నారు.

## టేక్మాల్ ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి సందర్భంగా వేడుకలు



**అందోల్, జూన్ 21 (సమ సమాజం):** అందోల్ నియోజకవర్గం టేక్మాల్ మండల పరిధిలో తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ వర్ధంతి సందర్భంగా మంగళవారం మేజర్ గ్రామ పంచాయతీ టేక్మాల్ లో టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.తెలంగాణ ఉద్యమ భావ వ్యాప్తి చేసిన ఆచార్య జయశంకర్ సార్ వర్ధంతి ఈ సందర్భంగా టేక్మాల్ మండల కేంద్రంలో జయశంకర్ సార్ కు శ్రద్ధాంజలి ఘటిస్తున్న నాయకులు, విద్యార్థినిలు తెలంగాణ తొలిదశ మలిదశ ఉద్యమానికి స్ఫూర్తి ప్రదాత అని తెలంగాణ సాధన కోసం తన ఊపిరి ఉన్నంత వరకు క్షమించిన మహనీయులు కేసీఆర్ కి అన్నివిధాలా సలహా సూచనలు కెసిఆర్ తెలంగాణ సాధించడానికి దిక్సూచి జయశంకర్ అని గుర్తు చేశారు. జయశంకర్ సార్ ఆశయసాధనకు కృషి చేయాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల తెరాస అధ్యక్షులు భక్తుల వీరప్ప, సర్పంచ్ నాయికోటి సుప్రజా భాస్కర్, కొండి మహేందర్ తెరాస నాయకులు వివిధ సంఘాల నాయకులు విద్యార్థి విద్యార్థులు పాల్గొన్నారు.

## బండి సంజయ్‌కు భద్రత పెంపు



**హైదరాబాద్, జూన్ 21 (సమ సమాజం):** తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్‌కు పోలీసులు భద్రతను పెంచారు. బండి సంజయ్‌కు 1ప్లస్ 5తో రోప్ పార్టీ ఏర్పాటు చేశారు. అదనంగా ఎస్కార్ట్ వాహనాన్ని పోలీసులు కేటాయించారు. హైదరాబాద్ పరిధిలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి భద్రత పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. కరీంనగర్‌లో చేసిన వ్యాఖ్యలతో బండి సంజయ్‌కు ముప్పు ఉన్నట్లు ఇంటెలిజెన్స్ నివేదిక ప్రకారం పోలీసులు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. అలాగే ప్రస్తుతం అగ్నిపథ్‌లాంటి తాజా పరిస్థితుల నేపథ్యంలో భద్రత ఏర్పాటు చేశారు.

## మైకు కడుతుండగా విద్యుత్ షాక్



ప్రమాదంలో ముగ్గురు మృతి

ఘటనపై తీవ్రదిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మంత్రి

**మహబూబాబాద్, జూన్ 21 (సమ సమాజం):** జిల్లాలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ముగ్గురు వ్యక్తులు మృతి చెందారు. ఈ విషాదకర సంఘటన డోర్నకల్ మండలం అందనాలపాడు గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలోని రామాలయం గుడికి మైకులు కడుతుండగా విద్యుత్ తీగలు తగిలి ముగ్గురు మృతి చెందారు. గుడి పక్కన ఉన్న వేప చెట్టును ముగ్గురు వ్యక్తులు ఎక్కారు. సుబ్బారావు (67) మైకు కడుతుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగ తగిలింది. అతడిని కాపాడే క్రమంలో మస్తాన్ రావు(57), వెంకయ్య (55) ఇద్దరికి షాక్ రావడంతో అక్కడికక్కడే ముగ్గురు మృతి చెందారు. ముగ్గురి మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ముగ్గురు మృతితో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మైకులు కట్టే సమయంలో విద్యుత్ మెయిన్ లైన్ తీగలు కిందపడి ప్రమాదం జరిగినట్టు సమాచారం. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఘటనపై మంత్రి సత్యవతి రాథోడ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మహబూబాబాద్ కలెక్టర్ శశాంకతో ఫోన్‌లో మాట్లాడిన మంత్రి...ఘటనకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ప్రస్తుత పరిస్థితిని సమీక్షించి వెంటనే తదుపరి చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు మంత్రి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరపున అండగా ఉంటామని మంత్రి సత్యవతి రాథోడ్ హామీ ఇచ్చారు.

## రైతు ఆత్మహత్యలు అన్నీ ప్రభుత్వ హత్యలే



ములుగు కాంగ్రెస్ ఎమ్మెల్యే సీతక్క

**ములుగు, జూన్ 21 (సమ సమాజం):** రైతు ఆత్మహత్యలు అన్నీ ప్రభుత్వ హత్యలే అని ములుగు కాంగ్రెస్ ఎమ్మెల్యే సీతక్క ఆరోపించారు. సీఎం కేసీఆర్ కు పక్క రాష్ట్రంలో రైతుల మీద ఉన్న ప్రేమ తెలంగాణలోని అన్నదాతలపై లేదని విమర్శించారు. అప్పుల బాధ తట్టుకోలేక అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటే..వారి కుటుంబాలకు అండగా నిలవాల్సిన నాయకులు వారిని పట్టించుకోవడం లేదన్నారు. ఇటీవల ఆత్మ హత్యలు చేసుకున్న గోవిందా రావు పేట,ములుగు మండలానికి చెందిన రైతు కుటుంబాలు తప్పెట్ల స్వరూప, మేడ సంధ్య,గువ్వ సరిత, అరిగెల రాజేంద్ర కుటుంబాలకు కాంగ్రెస్ తరుపున ఎమ్మెల్యే సీతక్క రూ. 50 వేల చొప్పున చెక్కులు పంపిణీ చేశారు. కాంగ్రెస్ హయాంలో రైతులకు ఇన్ పుట్ సబ్సిడీ అందజేసిందని గుర్తు చేశారు.

# కేసులు అధికారులపై కాదు..దమ్ముంటే నాపై పెట్టండి

8ఏళ్లలో బిజెపి దేశానికి చేసిందేమీ లేదు ● కిషన్ రెడ్డికి బెదిరింపులు తగవు ● మంత్రి కెటీఆర్ ఘాటు హెచ్చరిక



**హైదరాబాద్, జూన్ 21 (సమ సమాజం):** దేశంలో అగ్నిపథ్ అనే పథకాన్ని తీసుకొచ్చి యువత కడుపు కొడుతున్నారని మంత్రి కేటీఆర్ మండిపడ్డారు. ఆవేదనతో వారు ఆందోళన చేస్తుంటే వారిపై దేశద్రోహం కేసులు పెడుతున్నారని ఆరోపించారు. హైదరాబాద్‌లో నూతనంగా అందుబాటులోకి వచ్చిన కైతలాపూర్ ఫ్లై ఓవర్‌ను ప్రారంభించారు. మొత్తం రూ.86 కోట్లతో దీనిని నిర్మించారు. ఈ బ్రిడ్జి నిర్మాణంలో హైటెక్ సిటీ ఉద్యోగులకు ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి. ఇది హైదరాబాద్ 30వ ఫ్లై ఓవర్ అని మంత్రి కేటీఆర్ చెప్పుకొచ్చారు. ఇంకో 17 ఫ్లై ఓవర్లు నిర్మాణ దశలో ఉన్నాయని ఈ ఏడాదిలో మరో 6 అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి కేటీఆర్ చెప్పారు. ఐడీపీఎల్ నుంచి రోడ్లు వేస్తుంటే కేసులు పెట్టమని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చెప్తున్నారంట. కిషన్ రెడ్డికి దమ్ముంటే మున్సిపల్ మంత్రినైన నా మీద కేసు పెట్టండి. చిన్నా చితక అధికారులను బెదిరించొద్దు. మీకు చేతనైతే రోడ్లు, ఫ్లై ఓవర్లు కట్టండి అంతే కాని అభివృద్ధి అడ్డుకోకండిని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కేటీఆర్ కోరారు.కిషన్ రెడ్డి మోదీ ప్రభుత్వంలో కేంద్రమంత్రిగా ఉండి అగ్నిపథ్‌లో చేరితే డ్రైవర్లు, బట్టలు ఉతికే స్కిల్స్ వస్తాయి అంటున్నారు. ఈ మాత్రం దానికి దేశ యువత మిలిటరీలో చేరాలా అంటూ కేటీఆర్ ప్రశ్నించారు. 'బీజేపీ నేతలు ప్రధాని నరేంద్ర మోదీ త్వరలో హైదరాబాద్ వస్తారు అని అంటున్నారు. ఏ మొహం పెట్టుకుని హైదరాబాద్‌కు వస్తున్నారు. ఎక్కడకు వెళ్లినా వేల కోట్ల రూపాయల పనులు శంకుస్థాపన చేశారని చెప్తారు అందులో ఎంత నిజముందో తెలియదు. హైదరాబాద్‌కు టూరిస్టులు వస్తారు పోతారు. మన కేసీఆర్ ఇక్కడే ఉంటారు. వచ్చే టూరిస్టులు ఏం తెచ్చారో ఏం ఇచ్చారో చెప్పాలని' మంత్రి కేటీఆర్ కోరారు. అధికారంలోకి వచ్చిన 8ఏళ్లలో కేంద్రప్రభుత్వం ప్రజలకు తీరని అన్యాయం చేసిందని మంత్రి కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. ఐడీపీఎల్ విషయంలో కేసులు వేయండని ఒక కేంద్రమంత్రి అంటున్నారని.. మీకు దమ్ముంటే.. నా మీద, రాష్ట్ర ప్రభుత్వంపై కేసు పెట్టండని కేటీఆర్ సవాల్ విసిరారు. సామాన్యుల మీద ఎనలేని భారం మోపుతున్నారని ధ్వజమెత్తారు. నగరాభివృద్ధికి రహదారులు, ప్రజారవాణా వ్యవస్థే సూచిక అన్న కేటీఆర్... రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించిన కేటీఆర్... అగ్నిపథ్ విషయంలో నిరుద్యోగులకు తీరని అన్యాయం చేస్తున్నారని ధ్వజమెత్తారు. దేశంలో ఔషధాల తయారీ కోసం ఐడీపీఎల్‌ను ఏర్పాటు చేశారు. ఐడీపీఎల్ కోసం రాష్ట్ర ప్రభుత్వం భారీగా భూమిలిచ్చింది. ఐడీపీఎల్ విషయంలో కేసులు వేయండని ఒక కేంద్రమంత్రి అంటున్నారు. మీకు దమ్ముంటే.. నా మీద, రాష్ట్ర ప్రభుత్వంపై కేసు పెట్టండి. ఇంజినీర్లు, సిబ్బంది, కార్మికులపై కేసులు వేయవద్దని కోరుతున్నా. రక్షణశాఖ ఆధీనంలో ఉన్న భూములను రాష్ట్రానికి అప్పగిస్తే అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తామని కేటీఆర్ అన్నారు. భాజపా ప్రభుత్వం దేశానికి చేసిందేమీ లేదన్న కేటీఆర్... ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంలో మోదీ ఘోరంగా విఫలమయ్యారన్నారు. పేదవారికి అండగా ఉండడమే తెరాస ప్రభుత్వ లక్ష్యమన్న మంత్రి కేటీఆర్... త్వరలో కొత్త రేషన్‌కార్డులు కూడా మంజూరు చేస్తామన్నారు. రూపాయి లంచం లేకుండా రెండు పడకల ఇళ్లు అందిస్తున్నామన్నారు. మన బస్తీ-మన బడి ద్వారా పాఠశాలలు బాగు చేసుకుంటున్నాం. 57 ఏళ్లు వయసు దాటిన అర్హులైన వారికి త్వరలో పింఛన్లు. 2014 ముందు 29 లక్షల పింఛన్లు వచ్చేవి. ఇప్పుడు 40 లక్షల మందికి పింఛన్లు ఇస్తున్నాం. పేదవారికి అండగా ఉండడమే తెరాస ప్రభుత్వ లక్ష్యం. త్వరలో కొత్త రేషన్‌కార్డులు కూడా మంజూరు చేస్తామని కూడా కేటీఆర్ ప్రకటించారు.

## గ్రామీణాభివృద్ధితోనే బంగారు తెలంగాణ

మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

**వరంగల్, జూన్ 21 (సమ సమాజం):** దేశంలో సీఎంలు అంతా పట్టణాల వెంట పరిగెడుతుంటే... సీఎం కేసీఆర్ మాత్రం పల్లెలు, పల్లె ప్రజలను, కులవృత్తులను పట్టించుకుంటున్నారని రాష్ట్రమంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. వ్యవసాయాన్ని, రైతాంగాన్ని బలోపేతం చేయడమే కాకుండా కులవృత్తులను ప్రోత్సహిస్తున్నారని ఆయన చెప్పారు. మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలు భివృద్ధి చెందితేనే బంగారు తెలంగాణ సాధ్యమని గుర్తించిన సిఎం కెసిఆర్ అనేక కార్యక్రమాలతో నడిపిస్తున్నారని అన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.అందుకే తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. రీ ఇంజినీరింగ్ వల్ల పాకాల చెరువు కింద 30 వేల ఎకరాలకు రెండో పంటకు నీరందించామని తెలిపారు. రామప్ప-పాకాల నిర్మాణ పనులను ఏడాదిలోగా పూర్తిచేస్తామని వెల్లడించారు. గాంధీజీ స్ఫూర్తితో 14 ఏళ్లు శాంతియుత పోరాటం చేసి తెలంగాణ సాధించిన నాయకుడు కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నారన్నారు. సకల జనుల సమస్యలు తెలిసిన వ్యక్తి మన సీఎం అని, ఆయన పాలనలో అందరికీ న్యాయం జరుగుతోందని వివరించారు. ప్రజల సమస్యలు అన్ని పరిష్కారం అవుతాయని మంత్రి తెలిపారు.

## పెంచిన ఆర్టీసీ ఛార్జీలను బేషరతుగా వెంటనే తగ్గించాలి నిమ్మ రమేష్



టేక్మాల్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు

**అందోల్, జూన్ 21 (సమ సమాజం):** రాష్ట్ర ప్రభుత్వం పెంచిన ఆర్టీసీ చార్జీలకు వ్యతిరేకంగా టేక్మాల్ మండల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీగా వెళ్లి కలెక్టరేట్ ముట్టడిస్తాం ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం చేస్తామని ఈ సందర్భంగా టేక్మాల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నెలకొకసారి ఆర్టీసీ చార్జీలు, కేంద్ర ప్రభుత్వం పెట్రోల్ చార్జీలు పెంచినట్లు పెంచుకుంటూ పోతుందని విమర్శించారు. కరెంట్ చార్జీలు, నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్లుగా ఆర్టీసి చార్జ్ లు పెంచిందన్నారు. అటు కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు రోజురోజుకు పెంచుకుంటూ పోతూ ఉంటే ఇటు రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్ర ప్రభుత్వానికి పోటీగా పేద మధ్యతరగతి ప్రజల మీద భారాలు వేయడానికి ఆర్టిసి బస్ ఛార్జీలు పెంచిందన్నారు. అటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నాయి అని విమర్శించారు. పెంచిన ఆర్టిసి బస్ ఛార్జ్ వెనువెంటనే బేషరతుగా తగ్గించాలని లేనియెడల రాష్ట్ర వ్యాప్తంగా పాల్గొంటాం.




# చలన చిత్రం

## చైతూ డేటింగ్‌లో ఉన్నాడంటూ పుకారు

### తనపై విమర్శలకు ఘాటు స్పందించిన సమంత



టాలీవుడ్ స్టార్ కపుల్ సమంత, నాగచైతన్య గతేడాది డిసెంబర్‌లో విడాకులు తీసుకున్న సంగతి తెలిసిందే. చాలాకాలంపాటు ప్రేమించుకున్న వీరిద్దరు ఐదేళ్ళ వైవాహిక జీవితానికి శుభం కార్డు వేస్తూ విడాకులను ప్రకటించారు. ఈ విషయం అటు సమంత అభిమానులను ఇటు నాగచైతన్య అభిమానులను తీవ్ర నిరాశకు గురి చేసింది. ఇక ఈ జంట గురించి ఎక్కువ వార్తలు వచ్చిన క్షణాల్లో వైరల్ అవుతున్నాయి. అయితే వీరి విడాకుల ప్రస్తావనలో ఎక్కువగా సమంతపైనే ఆరోపణలు వచ్చాయి. అప్పట్లో సమంత వేరొకరితో డేటింగ్‌లో ఉందని ప్రచారం జరిగింది. వీటిపై సమంత కూడా వెంటనే స్పందించి.. ఇవన్ని పుకార్లే అని కొట్టిపారేసింది.ఇదిలా ఉంటే తాజాగా నాగచైతన్య, శోభితా ధూళిపాల డేటింగ్‌లో ఉన్నారంటూ గత రెండు రోజుల నుంచి వార్తలు వస్తున్నాయి. వీళ్ళిద్దరు కొన్ని రోజులు నుంచి డేటింగ్‌లో ఉన్నట్లు, ఇటీవలే చైతన్య ఈమె బర్త్‌డే పార్టీను ఓ హోటల్‌లో గ్రాండ్‌గా నిర్వహించినట్లు వార్తలు తెగ వైరల్ అవుతున్నాయి. అయితే ఈ రూమర్స్‌పై నాగ చైతన్య అభిమానులు స్పందిస్తూ.. చై ఇమేజ్ చెడగొట్టడానికి సమంత పీఆర్ టీం ఈ రూమర్స్‌ను సృష్టిస్తున్నారని ట్వీట్స్ చేస్తున్నారు. ఈ ట్వీట్స్‌పై సామ్ స్పందిస్తూ.. 'అమ్మాయిపై పుకార్లు వస్తే నిజమే.. అబ్బాయిపై పుకార్లు వస్తే కావాలని అమ్మాయే చేయించింది. ఇకనైనా ఎదగండి గాయ్స్.. తప్పుడు ప్రచారం చేసే వాళ్ళు చేస్తూనే ఉంటారు. మేము మూవ్‌ఆన్ అయిపోయాం. మీరు కూడా మూవ్‌ఆన్ అవ్వండి. మీ పనిమీద, కుటుంబాల మీద శ్రద్ధపెట్టండి' అంటూ సమంత ఆ మీడియా కథనాన్ని ట్యాగ్ చేసింది. ప్రస్తుతం ట్వీట్ నెట్టింట వైరల్ అవుతుంది.

## ఆర్‌ఆర్‌ఆర్ ఆస్కార్‌కు నామినేట్ అవుతుందా

### సోషల్ మీడియాలో ఇప్పుడదే చర్చ



దర్శకధీరుడు రాజమౌళి మలిచిన క్రేజీ మల్టీస్టారర్ 'ఆర్.ఆర్.ఆర్' రీసెంట్ గా ఓటీటీలోకి వచ్చిన ఈ సినిమాకి అక్కడ కూడా విపరీతమైన స్పందన దక్కింది. ప్రముఖ హాలీవుడ్ రైటర్ క్రిష్టఫర్ మిల్లర్ , సినిమా, టీవీ రైటర్ ఆమి పొలేట్ హార్ట్ మేన్ లాంటి వారే కాకుండా.. మరెందరో హాలీవుడ్ ప్రముఖులు 'ఆర్.ఆర్.ఆర్' చిత్రాన్ని, రాజమౌళి టేకింగ్ ను ఆకాశానికెత్తేశారు. ఈ నేపథ్యంలో 'ఆర్.ఆర్.ఆర్' చిత్రం ఆస్కార్ కు నామినేట్ అవుతుందా లేదా అన్న విషయంలో సోషల్ మీడియాలో తెగ చర్చ నడుస్తోంది. భారతీయ ప్రేక్షకులు ఆ సినిమా ఆస్కార్‌కు నామినేట్ అవ్వాలని కోరుకుంటున్నారు. ఒకవేళ మనదేశం నుంచి 'ఆర్.ఆర్.ఆర్' చిత్రం ఆస్కార్ నామినేషన్ కు వెళితే.. ఖచ్చితంగా తిరస్కారానికి గురవుతుందని చాలా మంది అనుకొనే మాట. ఆర్ట్ హౌస్ కేటగిరికి చెందిన ఏ అస్సామీ చిత్రమో లేక ఏ హిందీ చిత్రమో దాని ప్లేస్ లో నామినేట్ అవుతుందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అయితే 'ఆర్.ఆర్.ఆర్' చిత్రానికి మనదేశం నుంచి బలమైన రికమండేషన్ లభించి నామినేట్ అయితే మాత్రం నిజంగా అది హిస్టరీనే. సో.. 'ఆర్.ఆర్.ఆర్' చిత్రం ఆస్కార్ కు నామినేట్ అవ్వాలని ఆశిద్దాం.

## జుగ్‌జుగ్ జీయో విడుదలకు ముందే షాక్

### సినిమాను కాపీ కొట్టారంటూ కేసు..రాంచీ కోర్టు ఉత్తర్వులు



బీటౌన్ దర్శక నిర్మాతల్లో ప్రముఖంగా చెప్పుకునే వారిలో ఒకరు కరణ్ జోహార్. ఆయన ధర్మ ప్రొడక్షన్స్ పేరిట తాజాగా నిర్మించిన చిత్రం 'జుగ్‌జుగ్ జీయో'. రాజ్ మెహతా దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ క్యాస్ట్ అనిల్ కపూర్, నీతూ కపూర్, వరుణ్ ధావన్, కియరా అద్వానీ ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ మూవీ జూన్ 24న విడుదలకు సిద్ధంగా ఉంది. ఫుల్ లెంగ్త్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా అలరించేందుకు రెడీ అయిన తరుణంలో తాజాగా నిర్మాత కరణ్ జోహార్‌కు షాక్ తగిలింది. ఈ సినిమా విడుదలకు ముందే తమకు చూపించాలని రాంచీ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. విషయం ఏంటంటే.. తను పంపించిన పాయింట్స్‌ను కాపీ కొట్టి 'జుగ్‌జుగ్ జీయో' సినిమాను నిర్మించారని రాంచీకి చెందిన రచయిత విశాల్ సింగ్ ఆరోపించారు. దానికి సంబంధించిన స్క్రీన్‌షాట్స్ కూడా తన వద్ద ఉన్నాయని చెప్పుకొచ్చాడు. 'బన్నీ రాణీ' అనే టైటిల్‌తో కొన్ని పాయింట్స్‌ను ధర్మ ప్రొడక్షన్స్‌కు పంపించినట్లు ఆయన తెలిపాడు. తర్వాత ఆ సంస్థ నుంచి రిప్లై కూడా వచ్చిందని, అయితే ఆ పాయింట్స్‌ను సినిమాగా రూపొందిస్తున్నట్లు ధర్మ ప్రొడక్షన్స్ తనతో చెప్పలేదని, తీరా చూస్తే ఆయన పాయింట్స్‌తో ఈ మూవీ వచ్చినట్లుగా పేర్కొన్నాడు. ఈ విషయంపై రాంచీ కోర్టులో దావా వేశారు విశాల్. పిటిషన్ స్వీకరించిన రాంచీ కమర్షియల్ కోర్టు సినిమా విడుదలకు ముందే తమకు చూపించాలని ఉత్తర్వులు జారీ చేసింది. స్క్రీనింగ్ తర్వాత ఇరువైపులా వాదనలు విని, కాపీ రైట్ ఉల్లంఘన జరిగిందో, లేదో చెబుతామని వెల్లడించింది. అయితే ఇప్పటివరకు ఈ విషయంపై కరణ్ జోహార్ అధికారికంగా స్పందించలేదు. కాగా 'జనవరి 2020లో బన్నీ రాణీ టైటిల్‌తో కథ రిజిస్టర్ చేసుకున్నా. 2020 ఫిబ్రవరిలో సహ నిర్మాతగా వ్యవహరించే అవకాశం కోసం ధర్మ ప్రొడక్షన్స్‌కు మెయిల్ చేశా. నాకు రిప్లై కూడా ఇచ్చారు. తర్వాత వాళ్లు నా స్టోరీ తీసుకున్నారు. జుగ్‌జుగ్ జీయో సినిమాను తెరకెక్కించారు. ఇది సరికాదు కరణ్ జోహార్.' అని విశాల్ సింగ్ ట్వీట్ చేశారు. ప్రస్తుతం ఈ ట్వీట్‌తోపాటు విశాల్ పంపించిన పాయింట్స్‌కు సంబంధించిన స్క్రీన్‌షాట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.

## మేజర్ టీమ్‌ను సత్కరించిన యూపి సిఎం యోగి



ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్ 'మేజర్' టీమ్‌ను సత్కరించారు. చిత్ర కథానాయకుడు అడివి శేష్, సందీప్ ఉన్ని కృష్ణన్ తల్లిదండ్రులు మంగళవారం యోగి ఆదిత్యానాథ్‌ను కలిశారు. ఈ సందర్భంగా యోగి చిత్ర బృందాన్ని అభినందించారు. అడివి శేష్‌తోపాటు సందీప్ తల్లిదండ్రులను శాలువతో సత్కరించి, వెండి కాయిన్ బహకరించారు. ఈ విషయాన్ని అడివి శేష్ ట్విట్టర్ వేదికగా అభిమానులతో పంచుకుని ఆనందం వ్యక్తం చేశారు. నేను, సందీప్ ఉన్ని కృష్ణన్ తల్లిదండ్రులు, నా టీమ్‌తో కలిసి యోగి ఆదిత్యానాథ్‌గారిని కలిశాం. 'మేజర్' చిత్రం గురించి ఆయన చెప్పిన మాటలు విని చాలా సంతోషించాం. మమ్మల్ని శాలువతో సత్కరించి, ఒక వెండి కాయిన్‌ను బహుకరించడం చాలా గర్వంగా అనిపించింది. ఇదొక గొప్ప గౌరవంగా భావిస్తున్నా'అని శేష్ రాసుకొచ్చారు. శశి కిరణ్ తిక్కా దర్శకత్వంలో అడివి శేష్, సయీ మంజ్రేకర్ జంటగా నటించిన 'మేజర్' చిత్రం ప్యాన్ ఇండియా స్థాయిలో విడుదలై సక్సెస్ సాధించింది. ఊహించిన దాని కన్నా అధిక వసూళ్లు రాబట్టడమే కాకుండా గౌరవ మర్యాదలు కూడా తెచ్చిపెట్టిందీ చిత్రం.

## చోర్ బజార్ ఆధారంగా సినిమా



'జార్జ్ రెడ్డి' సినిమాతో దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న జీవన్ రెడ్డి ఇప్పుడు పూరి జగన్నాథ్ కొడుకు ఆకాష్‌తో 'చోర్ బజార్' తీశాడు. వీ.ఎస్.రాజు నిర్మించిన ఈ మూవీ జూన్ 24న విడుదలవుతున్న సందర్భంగా జీవన్ మాట్లాడుతూ 'లాజిక్కులన్నీ పక్కన పెట్టి, ఫుల్ కమర్షియల్ ఎలిమెంట్స్‌తో తీసిన సినిమా ఇది. ప్రతి ఫ్రేమ్ కలర్‌ఫుల్‌గా ఉంటుంది. 'జార్జ్ రెడ్డి' కంటే ముందే ఈ కథ రాశాను. అదిప్పుడు సెట్టయ్యింది. బ్లడ్, వయిలెన్స్ లేకుండా ఎంటర్‌టైనింగ్‌గా ఉంటుంది. నేను చోర్ బజార్‌కు వెళ్లి సరదాగా తిరిగేవాడిని. అక్కడి ప్రజలను గమనిస్తూ ఉండేవాణ్ని. ఎదుటి వ్యక్తి అవసరానికి తగ్గ రేటుకు వస్తువులు అమ్మేవారు. వారిలో నిజాయితీ కనిపించింది. అలాంటివారి జీవితాల్లో నుంచి ఈ కథ తీసుకున్నా. ప్రభుత్వం తరపున వాళ్లకీ ఓ గుర్తింపు ఇవ్వాలని చూపించాం. ఈ స్టోరీకి ఇరవై రెండేళ్ల కుర్రాడు కావాలి. ఆకాష్ అయితే బాగుంటుందనిపించింది. బచ్చన్ సాబ్ క్యారెక్టర్‌కి అతను పర్‌ఫెక్ట్. ఆకాష్‌ని సెట్‌లో చూస్తే పూరి గారి కంటే ఎక్కువ డిసిప్లిన్డ్‌గా ఉంటాడనిపించింది. దీనికి, పూరి సినిమాలకి పోలిక ఉండదు. వర్మగారి 'మనీ మనీ' స్టైల్‌లో అనిపిస్తుంది. హీరోయిన్ క్యారెక్టర్‌ని డిఫరెంట్‌గా డిజైన్ చేశా. సంపూర్ణేష్ బాబు, సునీల్‌ల కామెడీ నవ్విస్తుంది. విలన్ ఎవరనే సస్పెన్స్ ÷–లకైమాక్స్ వరకు సాగుతుంది. నెక్స్ట్ మూవీకి స్క్రిప్ట్ రెడీగా ఉంది. నటీనటులు ఎవరనేది త్వరలోనే అనౌన్స్ చేస్తా' అని చెప్పారు.

## 7 డేస్ 6 నైట్స్ ట్రైలర్ విడుదల




సుమంత్ అశ్విన్, రోహన్ హీరోలుగా ఎం.ఎస్.రాజు దర్శకత్వంలో రూపొందిన చిత్రం '7 డేస్ 6 నైట్స్'. మెహర్ చాహల్, కృతికా శెట్టి హీరోయిన్లు. జూన్ 24న సినిమా విడుదలవుతున్న సందర్భంగా కొత్త ట్రైలర్‌ను విడుదల చేశారు. ఎం.ఎస్.రాజు మాట్లాడుతూ 'ఇద్దరు యువకుల జర్నీ ఇది. యూత్‌తో పాటు ఫ్యామిలీ ఆడియెన్స్ చూసే సినిమా. అందుకే తక్కువ రేటుకు టికెట్స్ అమ్మమని డిస్టిబ్యూటర్స్‌కి చెప్పా. ఈ చిత్రంతో నిర్మాతలుగా మారిన మా అబ్బాయి సుమంత్‌కి, అమ్మాయి రిషితా దేవికి ఆల్ ద బెస్ట్. సుమంత్ డీ గ్లామరస్ రోల్ చేశాడు. రోహన్‌తో పాటు హీరోయిన్లు కొత్తవాళ్లు అయినా చక్కగా నటించారు' అన్నారు. 'ఫస్ట్ కాపీ చూశాం. ఓ మాస్టర్ పీస్‌లా కనిపించింది. టీమ్ అందరికీ థ్యాంక్స్' అన్నాడు సుమంత్. అవకాశమిచ్చిన దర్శక నిర్మాతలకి రోహన్, మెహర్, కృతిక థ్యాంక్స్ చెప్పారు. నిర్మాతలు రజనీకాంత్, రిషితా దేవి, సంగీత దర్శకుడు సమర్థ్ గొల్లపూడి తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **GPR PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
TITLE CODE.TELTEL02057, Cell:8464816456 Email: aksharavelugudaily@gmail.com, Website: www.aksharavelugu.com